కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజారులలో కూరగాయల ధరలు(కిలో.. రూపాయల్లో) టమాటా 15, వంకాయ 18, బెండ 40, పచ్చిమిర్చి 35, కాకర 38, బీర 38, క్యాబేజీ 11, ఫ్రెంచిబీన్స్ 85, క్యారెట్ 28, దొండ 15–23, చిక్కుడు 65, గోకర 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 45, ఆలుగడ్డ 24, దోస 15, సొరకాయ 9, పొట్లకాయ 23, ఉల్లిగడ్డ 20, చామగడ్డ 35. గమనిక: ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

చంపాపేటను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లోని సమస్యలను దశలవారీగా పరిష్కరించి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్థానిక డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మల్‌రెడ్డినగర్‌లో రూ.50 లక్షలతో శుక్రవారం ప్రారంభించిన సీసీ రోడ్ల పనులను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కార్యక్రమంలో సర్కిల్ ఏఈ సురేష్, కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు గంగాధర్ రెడ్డి, భూపతిరెడ్డి, సత్తయ్య, కృష్ణయ్య, రామ్‌నివాస్ తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ పరిధికి హైడ్రా బైక్



చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6 పరిధికి హైడ్రా బైక్‌ను కేటాయించినట్లు సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ తెలిపారు. మలక్‌పేటలో ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులు, అంతర్గత రహదారుల్లో చెట్లకొమ్మలు, వైర్లు తెగి పడినప్పుడు, రోడ్లు బ్లాక్ అయినప్పుడు వాటిని తొలగించేందుకు హైడ్రా బైక్‌లు వినియోగించాలని అన్నారు. బస్తీల్లో చిన్న చిన్న గల్లీలో చెట్లు కూలినా, కొమ్మలు విరిగినా హైడ్రా వ్యాన్లు ఘటనా స్థలానికి వెళ్లలేక పోతున్నాయన్నారు. దానిని దృష్టిలో పెట్టుకొని హైడ్రా తన సేవలను గల్లీల్లోకి విస్తరించడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో సర్కిల్‌కు ఒక హైడ్రా బైక్ కేటాయించినట్లు తెలిపారు. ఈ బైక్ వెనుక చెట్ల కొమ్మలు తొలగించే పరికరాలతో కూడిన డబ్బాను ఏర్పాటు చేశారు. ఈ బైక్‌లు నల్గొండ క్రాస్ రోడ్ వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఫోన్ నెం: 90001 13667.

‘కొమ్మలు కొట్టి.. కుప్పలుగా పెట్టి..’

- ఇష్టానుసారంగా చెట్ల కొమ్మలు నరికేస్తారు..
- రోడ్డు పక్కన పడేసి పనికానిచ్చేస్తారు..
- నెలలు గడిచినా వాటిని తొలగించేవారుండరు..
- ఎన్నిమార్లు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు



నెలల తరబడి కుప్పలుగా చెట్ల కొమ్మలు

స్వచ్ఛ డివిజన్‌గా తీర్చిదిద్దుతాం.. చెత్త డంపింగ్ బిన్స్ లేకుండా చేస్తాం.. స్వచ్ఛ హైదరాబాదే లక్ష్యం.. పచ్చదనం పరిశుభ్రత.. ఇలాంటి మాటలు మనం నిత్యం జీహెచ్‌ఎంసీ అధికారులు, కార్పొరేటర్ల నోటి నుంచి వింటుంటాం. ఎక్కడ ఏ కార్యక్రమాల్లో పాల్గొన్నా ప్రజాప్రతినిధులు, అధికారులు స్వచ్ఛతపై ఉపన్యాసాలు పరిపాటి.. కానీ క్షేత్రస్థాయిలో చూస్తే ప్రకటనలకు విరుద్ధంగా మనకి ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు, అపరిశుభ్రంగా రోడ్లు, కొట్టి పడేసిన చెట్ల కొమ్ములు, అధ్వానంగా కాలనీలు తయారయ్యాయి. – చైతన్యపురి

చైతన్యపురి డివిజన్‌లో ఏ కాలనీలో చూసినా రహదారుల పక్కన కొట్టి పడేసిన చెట్ల కొమ్మలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. విద్యుత్ వైర్లకు తగులుతున్నాయని ఆ శాఖ సిబ్బంది చెట్టు కొమ్మలను కొట్టి అక్కడే వేసి వాటిని తొలగించకపోవడం వల్ల కాలనీల ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డివిజన్‌లోని సత్యనారాయణపురం, ప్రభాత్‌నగర్ కాలనీ, ద్వారకాపురి కాలనీ, వికాస్‌నగర్, సాయినగర్ కాలనీలలో ఏ రహదారి చూసినా విద్యుత్ సిబ్బంది కొట్టిపడేసి కుప్పలుగా పోసిన చెట్ల కొమ్మలే ఉన్నాయి. వాటిని నెలల తరబడి తొలగించకపోవటంతో ఎండిపోయి అలాగే పేరుకు పోతున్నాయని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వీటి ద్వారా వర్షాకాలంలో దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది పలువురు అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్ల కొమ్మలను కొట్టిన విద్యుత్ సిబ్బందికి వాటిని తొలగించే బాధ్యత లేదా..? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది స్పందించి వాటిని తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

నెలల తరబడి అలాగే..



కొట్టి పడేసిన కొమ్మలు నెలల తరబడి అలాగే ఉంటున్నాయి. ఎండకు ఎండి, వానకు తడిసి మురిగిపోతున్నా వాటిని తొలగించడం లేదు. దీంతో కాలనీలో రాకపోకలకు ఇబ్బందులు కలగడమే కాకుండా దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. చెట్ల కొమ్మలను కొట్టి ఇళ్ల ముందే పడేస్తున్నారు. దీంతో అసౌర్యంగా ఉంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించాలి.

– ఎండీ షాహీన్, హనుమాన్‌నగర్ కాలనీ

వాహనాలు అందుబాటులో లేక..



విద్యుత్ సిబ్బంది కొట్టిపడేసిన చెట్ల కొమ్మలు కుప్పలుగా పేరుకుపోతున్న మాట వాస్తవమే. చెత్త తరలించే వాహనాలు అందుబాటులో లేకపోవడం పెద్ద సమస్యగా మారింది. ఎప్పటికప్పుడు కొమ్మలను తొలగించకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి విద్యుత్ శాఖ చెట్ల కొమ్మలు కొట్టే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగిస్తారు. సదరు కాంట్రాక్టరే కొమ్మలను తొలగించాల్సి ఉంటుంది. వాహనాలు అందుబాటులో ఉంటే తొలగించేలా చూస్తున్నాం.

– రంగా నర్సింహగుప్తా, కార్పొరేటర్, చైతన్యపురి



ప్రభాత్‌నగర్ కాలనీలో రహదారి పక్కన..

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మతుల ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 నుంచి 11 గంటల వరకు..

రెడ్‌క్రాస్, గౌతంనగర్, చర్చ్, గడ్డిఅన్నారం, సాహితి నగర్, లలితా నగర్, మధురాపురి, కృష్ణనగర్, మైత్రీనగర్, ఇలైట్ రెసిడెన్సీ, అఫ్జల్‌నగర్, వెస్ట్ ప్రశాంత్‌నగర్, జాంజాం మిల్క్‌బూత్, సిరిపురం కాలనీ, మనోజ్ మాన్షన్ అపార్ట్‌మెంట్స్, సిరిపురం కాలనీ కమ్యూనిటీ హాల్, వాహెద్ నగర్, జెండా పీటీ, ఓల్డ్ మస్తాన్ గట్టి, వాహెద్ నగర్ ఏ టూ జెడ్, అల్ఫాలా మజీద్, న్యూ వాహెద్‌నగర్ పరిసర ప్రాంతాలు..

మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

లక్ష్మీనగర్ క్రాస్‌రోడ్, వాణినగర్, పటేలమ్మ మడిగె, ఆనంద్ బిస్కెట్ ఫ్యాక్టరీ, దోభీఘాట్ రోడ్, సిరిపురం కాలనీ, ఫ్రెండ్స్ కాలనీ, ఈస్ట్ అరోరా కాలేజ్ ఆపోజిట్, రామాలయం టెంపుల్, అగ్రికల్చర్ ఆఫీస్, ఒవైసీ గ్రౌండ్, అంబేడ్కర్ నగర్, హ్యాపీ హోమ్స్, ఫకీరీ గల్లీ, జమాల కాలనీ, పోచమ్మ టెంపుల్, అక్బర్‌బాగ్, పల్టన్ చౌరస్తా, దయానంద్ నగర్, ఆనంద్‌నగర్, మలక్‌పేట పరిసర ప్రాంతాలు..

మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు..

లక్ష్మీనగర్, ఇంద్రప్రస్థ కాలనీ, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, సంగం లక్ష్మీబాయ్ కాలేజ్, ఫరా హోటల్, అఘా పీటీ, హిదాయత్ ఫంక్షన్‌హాల్, అమన్ నగర్ పరిసర ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని డీఈ తెలిపారు.

చంపాపేట: మరమ్మతుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ తెలిపారు. అంజిరెడ్డి కాలనీ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు పవన్‌పురి, అంజిరెడ్డి, విష్ణుపురి, ఉదయ్‌నగర్, ప్రైస్, ఈస్ట్‌మారుతీ, పద్మానగర్, ఎంఆర్‌ఆర్, కల్యాణి మోటర్స్ ప్రాంతం, క్రాంతినగర్, శ్రీనిధి, నిర్మలా నగర్, జ్యోతినగర్, కర్మన్‌ఘాట్, రాఘవేంద్ర కాలనీలలో.. అదేవిధంగా శ్రీనివాసనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీన్‌పార్క్, శ్రీనివాస, శ్రీరాం నగర్, తపోవన్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామని తెలిపారు.

గోవధకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలి



డీసీపీ కంతిలాల్ సుభాష్‌కు అందజేస్తున్న గోశాల ప్రతినిధులు

చంచల్‌గూడ: గోవధ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని మాదన్నపేట గోశాల ప్రతినిధులు, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాదన్నపేట మార్కెట్ గోశాల సొసైటీ చైర్మన్ సహదేవ్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం గోప్రేమికులు, నాయకులు సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ కంతిలాల సుభాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సహదేవ్‌యాదవ్ మాట్లాడుతూ రానున్న బక్రీద్ పురస్కరించుకుని ఎవరైనా గోవధకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. గోవుల అక్రమ రవాణాపై పెద్ద సంఖ్యలో 24 గంటల పాటు చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. పశు సంరక్షణ శాఖ సర్టిఫికెట్ లేని పశువులను వధించకుండా అరికట్టాలన్నారు. ఆరోగ్యంగా ఉన్న గోవులను, ఎద్దులను అక్రమంగా రవాణా చేసి గోనిషేధ చట్టాన్ని ఉల్లంఘిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్‌జీ, గోశాల అధ్యక్షుడు ఉగాది మహేష్, బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌యాదవ్, సీనియర్ నాయకులు నర్సింహ, రవీందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కామాటీ మహేష్, వరుణ్ తదితరులున్నారు.

గిరిజనులే స్వాతంత్య్ర పోరాట సారథులు

- మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు



సాక్షి, సిటీబ్యూరో: గిరిజనులే స్వాతంత్య్ర పోరాటానికి సారథులని, సంస్కృతికి వారధులని మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్ రావు అన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం నిరంతరం పోరాడిన గిరిజనుల చరిత్రను క్రోడీకరిస్తూ ప్రచురించిన ‘గిరిజనులే తొలిస్వాతంత్య్ర సమరయోధులు’ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన విశిష్ట అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో నగర శివారులోని నాదర్‌గుల్ అశోక్‌నగర్ కాలనీలోని వైదేహి కౌశలంలో శుక్రవారం కార్యక్రమం నిర్వహించారు. ఏపీ ప్రభుత్వ మాజీ కార్యదర్శి దాసరి శ్రీనివాసులు విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. అఖిల భారత కళ్యాణ ఆశ్రమ ప్రశిక్షణ జట్టు సదస్యులు కొరిగింజ రామచంద్రయ్య పుస్తకాన్ని పరిచయం చేశారు. వనవాసీ కళ్యాణ పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి నిర్వహిస్తున్న ఏకోపాధ్యాయ పాఠశాలల ఆచార్యుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు.

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

దిల్‌సుఖ్‌నగర్: డివిజన్ పరిధిలోని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధాధీరజ్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని పలు కాలనీల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని కాలనీలలో ముంపు సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు ఆమె సూచించారు. కాలనీలలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీలో తరచూ ఏర్పడుతున్న వాటర్ లీకేజీలను అరికట్టాలని కార్పొరేటర్ అధికారులకు కోరారు. కార్యక్రమంలో కాలనీల నాయకులు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జైళ్ల శాఖలో వీడ్కోలు సమావేశం



చంచల్‌గూడ: తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈ క్రమంలో చంచల్‌గూడలోని డీజీ కార్యాలయంలో శుక్రవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఉద్యోగ విరమణ చేయనున్న అసిస్టెంట్ డిప్యూటీ జైలర్ ప్రమీళాబాయి (హైదరాబాద్), కె.సమ్మయ్య(కరీంనగర్)లను డీజీ డా.సౌమ్య మిశ్రా ఘనంగా సత్కరించారు. ఉద్యోగ కాలంలో జమ చేసిన వెల్ఫేర్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఇరువురు జైళ్ల శాఖకు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐజీలు యెర్రంశెట్టి రాజేష్, మురళీబాబు, డీఐజీలు డా.శ్రీనివాస్, సంపత్, సిబ్బంది ఉన్నారు.

నేడు శ్రీధ్యానాంజనేయ ఆలయ పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆలయ పాలక మండలి సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఈఓ లావణ్య

చంపాపేట: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయ స్వామివారి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం శనివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ లావణ్య స్పష్టం చేశారు. శుక్రవారం ఆలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరై నూతనంగా ఎంపికైన సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆలయం ప్రాంగణంలో ఉదయం 11.30 గంటలకు జిల్లా దేవాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో సభ్యుల ప్రమాణ స్వీకారం ఉంటుందని చెప్పారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి 3 గంటలు ట్రాఫిక్ జామ్



చాదర్‌ఘాట్: నల్లగొండ చౌరస్తా రోడ్డు జాతీయ రహదారిపై శుక్రవారం డ్రైనేజీ పైప్‌లైన్ పగిలి 3 గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దిల్‌సుఖ్ నగర్ నుంచి చాదర్‌ఘాట్ బ్రిడ్జి వరకు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బాలాల జలమండలి అధికారులు, ట్రాఫిక్ పోలీసులతో కలిసి ఆ ప్రాంతానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేయించారు. జలమండలి అధికారులు మరమ్మతులు చేపట్టారు.

ఘనంగా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ డాక్టర్ ఉమారెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు పసుపు, కుంకుమ అందజేశామన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓలు రాజన్, మార్తాండ, నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, కృపాకర్ రెడ్డి, రామకృష్ణ, రాజేష్, నళిని, జయంతి, లక్ష్మిదేవి, అరుంధతి, సావిత్రి పాల్గొన్నారు.

పార్కు అందుబాటులోకి రావడం సంతోషకరం

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి



బాలాజీనగర్‌కాలనీలో సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొప్పుల నర్సింహరెడ్డి

మన్సూరాబాద్: బాలాజీనగర్‌కాలనీలోని పార్కు అందుబాటులోకి రావడం సంతోషకరమని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్‌కాలనీలోని పార్కును శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు చుట్టూ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు. వర్షపు నీరు వృథా కాకుండా ఇంకుడు గుంతను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పార్కు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రంగారెడ్డి, ప్రమోద్‌రెడ్డి, సారయ్య, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో మరింత ఉత్సాహం



గెలుపొందిన చిన్నారులతో రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్: వేసవి శిబిరాలు చిన్నారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతాయని జేఎస్ఆర్ బ్యాడ్మింటన్ అకాడమి నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి అన్నారు. చంపాపేటలోని అకాడమిలో శుక్రవారం వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్యాడ్మింటన్, స్విమ్మింగ్ అంశాలలో వివిధ కేటగిరీల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు నిర్వాహకుడు రాజశేఖర్‌రెడ్డి, కోచ్ అబ్దుల్ కుదూస్ పతకాలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మాదిరిగానే తమ అకాడమిలో చిన్నారులకు బ్యాడ్మింటన్, స్విమ్మింగ్‌లో శిక్షణ, పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో చిన్నారులు, తల్లిదండ్రులు, అకాడమి సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తాం



మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోజుకు రోజుకూ నూతన కాలనీలు వెలుస్తున్నాయని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించేందుకు కృషిచేస్తానని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఆయా ప్రాంతాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం పరిశీలించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ సుజాతనాయక్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సుజాతనాయక్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజుగౌడ్, మమత, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



శశికళ (ఫైల్)

చంచల్‌గూడ: గొడవలతో మనస్థాపానికి గురైన ఓ మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాని ఘటన శుక్రవారం మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో చోటుచేసుకుంది. ఎస్ఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం కుర్మగూడ డివిజన్ సాయిలాల్‌తోటకు చెందిన శశికళ(70) సోమవారం కుటుంబ సభ్యులతో గొడవపడింది. దీంతో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాత్రి గడిచినా తల్లి ఇంటికి రాకపోవడంతో అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారుకు గీత పడిందని వ్యక్తిపై దాడి

మృతిచెందిన అపార్ట్‌మెంట్‌వాసి



నాగిరెడ్డి (ఫైల్)

చైతన్యపురి: పార్కు చేసిన కారుకు చిన్నపాటి గీత పడిందని మరో కారు యజమానిపై దాడి చేయడంతో మృతి చెందిన ఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకోవడంలో పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మృతుడి భార్య ఆరోపిస్తోంది. ఘటనపై అపార్టుమెంట్ వాసులు తెలిపిన వివరాలు.. న్యూమారుతీనగర్ కాలనీలోని వైష్ణవి మౌక్తిక అపార్టుమెంటులో ఉండే ఖమ్మం జిల్లాకు చెందిన గంగ్ర నాగిరెడ్డి ఈ నెల 21న తన కారును రోడ్డుపై పార్కు చేసి ఇంట్లోకి వెళ్లాడు. అదే సమయంలో నాగిరెడ్డి కారు ముందు మరో కారు పార్కు చేసిన జువ్వాజి కృష్ణ తన కారు తీసేందుకు అడ్డుగా ఉందని, చిన్నపాటి గీత పడిందని వాచ్‌మన్‌కు చెప్పగా అదేవిషయాన్ని వెళ్లి నాగిరెడ్డికి చెప్పాడు. కారు వద్దకు వచ్చిన నాగిరెడ్డి, కృష్ణ మధ్య గొడవ జరిగింది. దీంతో కృష్ణ ఆగ్రహంతో ఊగిపోతూ నాగిరెడ్డిపై దాడి చేశాడు. నోటి నుంచి రక్తం రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి భార్య అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నాగిరెడ్డి మృతికి కారణమైన కృష్ణ పరారీలో ఉన్నాడని వెంటనే అదుపులోకి తీసుకుంటామని చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ



మన్సూరాబాద్: డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని వర్ధానగర్‌కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి, హయత్‌నగర్ సీఐ నాగరాజుగౌడ్, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పోచబోయిన జగదీష్‌యాదవ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్‌రెడ్డి అన్నప్రసాద వితరణ చేశారు.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని జెడ్సీకి విజ్ఞప్తి



పెండింగ్ పనులను జెడ్సీకి వివరిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేసేలా చూడాలని గడ్డి అన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు విజ్ఞప్తి చేశారు. జోనల్ కార్యాలయంలో శుక్రవారం జెడ్సీని కలిసి డివిజన్‌లో ప్రారంభం అయిన, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూస్తామని జోనల్ కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.